క్లుప్తంగా

మండలానికి 121 కానుకల ప్యాకెట్లు మంజూరు

అర్వపల్లి : రంజాన్ సందర్భగా మండలంలో ముస్లింలకు 121 దుస్తుల ప్యాకెట్లు మంజూరైనట్లు తహసీల్దార్ పి. యాదగిరిరెడ్డి తెలిపారు. గ్రామాల వారీగా పేద ముస్లింలకు ఈ దుస్తుల ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ముస్లింలకు ఇఫ్తార్ విందు కూడా ఇచ్చామని పేర్కొన్నారు.

ప్రముఖ చిత్రకారుడికి నివాళి

అర్వపల్లి : ఏపీలోని విశాఖపట్నంకు చెందిన ప్రముఖ చిత్రకారుడు బాలి అకాల మరణం పట్ల పలువురు చిత్రకారులు సంతాపం వ్యక్తం చేశారు. అర్వపల్లిలో గురువారం బాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ చిత్రకారుడు బాపు తర్వాత అత్యధిక చిత్రాలు వేసి ఎన్నో జాతీయ అవార్డులు పొందిన ఘనత బాలికి దక్కిందని చెప్పారు. నివాళులర్పించిన వారిలో ఆర్టిస్ట్ అసోసియేషన్ నియోజకవర్గ బాధ్యుడు దడిపల్లి వెంకట్, రాము, శ్రీనివాస్, మధు, శోభన్ ఉన్నారు.

రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ఈర్ల సురేష్ భార్య పుష్పలత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. కానీ వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటం వల్ల వైద్యం చేయించుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో వైస్ ఎంపీపీ మారిపెద్ది భవానిశ్రీనివాస్‌గౌడ్ ఈ విషయాన్ని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి సీఎం సహాయనిధి నుంచి ఎల్‌ఓసీ ద్వారా రూ. 2.50 లక్షలు మంజూరు చేయించారు.

రిటైర్డ్ అటెండర్ మృతి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్ రిటైర్డ్ అటెండర్ అల్వాల గోవర్ధన్(72) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆయన సుమారు15 ఏళ్ల పాటు జాజిరెడ్డిగూడెం పాఠశాలలో సేవలందించారు. ఆయన మృతికి హెచ్‌ఎం కె.తబిత, జూనియర్ అసిస్టెంట్ ఏలె వీరప్రసాద్, ఉపాధ్యాయులు, సంతాపం వ్యక్తం చేశారు.

జయమ్మ మృతి తీరని లోటు



జయమ్మ మృతదేహంపై జెండా కప్పి నివాళులర్పిస్తున్న నాయకులు

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన సీపీఎం నాయకురాలు గునగంటి జయమ్మ మృతి పార్టీకి తీరని లోటని రైతు సంఘం మండల నాయకుడు కందాల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆమె మృతదేహంపై జెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ బొజ్జ శ్రీనివాస్, తొట్ల లింగయ్య, సామ సురేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, బాలగాని సోమయ్య, పోలెపాక నగేష్, బాణాల వెంకట్‌రెడ్డి, ఎల్లావుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

23న ప్రవేశ పరీక్ష

తుంగతుర్తి : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో ఐదవ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 23న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్యామలత తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

జేపీఎస్‌ల ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి

అర్వపల్లి : నాలుగేళ్ల ప్రొబేషనరీ వ్యవధి ముగిసిన జేపీఎస్‌ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ ఉద్యోగాల రెగ్యులరైజేషన్ కోసం ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, పంచాయతీరాజ్ అధికారులకు ఎక్కడికక్కడ మెమోరాండంలు అందజేశామని చెప్పారు. అలాగే ఔట్‌సోర్సింగ్ కార్యదర్శుల సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట కార్యదర్శులు నెహ్రూనాయక్, లింగయ్య, నారాయణమూర్తి, రాజశేఖరరెడ్డి, జ్యోతి, మహాలక్ష్మి, శ్రీనివాసరాజు, ఫర్హాన, మాధవిక, కావ్య ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మందుల సామేలు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన జోగు యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు గురువారం పరామర్శించారు. రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు.

'ఉపాధి'లో వసతులు కరువు

- పనుల వద్ద కనిపించని టెంట్లు, తాగునీరు
- అవస్థలు పడుతున్న కూలీలు
- పట్టించుకోని అధికారులు



అనంతారంలో ఎండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

పెన్‌పహాడ్ : కూలీలకు ఉన్న గ్రామంలోనే పనులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. దీనిని విజయవంతంగా కొనసాగించేందుకు సాంకేతికతను అమలులోకి తీసుకువచ్చింది. కూలీల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉపాధి కూలీల ఫొటోలను ఉదయం పని ప్రదేశం నుంచే తీసి పోర్టల్‌లో నమోదు చేయడం.. పూర్తయిన తర్వాత మళ్లీ పొటో తీసి నిక్షిప్తం చేయడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అలాగే గతంలో రోజుకు సరాసరి కూలి రూ. 242చెల్లిస్తుండగా.. రూ. 250కి పెంచింది. తాజాగా మరో 15 రూపాయలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతా బాగానే ఉన్నా పని ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కరువై చాలా ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో పనులు కొనసాగుతున్నాయి. మండల వ్యాప్తంగా 12,309 జాబ్‌కార్డులు ఉన్నాయి. రోజు 2,170 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. కానీ పని ప్రదేశాల్లో నీడ కోసం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో తప్పని పరిస్థితుల్లో కాసేపు సేద తీరడానికి చెట్లను ఆశ్రయించాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు. తాగునీటి కోసం ప్రత్యేకంగా ఒక కూలీని నియమించేవారని, కానీ దానిని తొలగించి ఒక వ్యక్తికి రూ. 5 ఇచ్చే విధానం తీసుకొచ్చారని, చివరకు ఆ నగదును ఇవ్వడంలేదని కూలీలు అంటున్నారు. తాగు నీటిని ఇంటి నుంచే సీసాల్లో తెచ్చుకుంటున్నామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ ఇబ్బందులు తీర్చాలని వారు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉంటున్నాయి. పనుల వద్ద టెంట్లు, తాగునీటి వసతి ఏర్పాట్లను అధికారులు విస్మరించారు. గతంలో పనుల వద్ద వసతులు కల్పించేవారు. ఇప్పుడు ఏమీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- బోళ్ల లక్ష్మయ్య, ఉపాధి కూలీ, అనంతారం

సౌకర్యాలపై దృష్టి సారిస్తున్నాం



పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సంబంధిత పంచాయతీల ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బందికి ఇప్పటికే తెలియజేశాం. సౌకర్యాల విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. కూలీలు ఆందోళన చెందవద్దు.

- రవి, ఏపీఓ

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ బృందం

సూర్యాపేట : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట షీ టీమ్ ఏఎస్‌ఐ పాండు నాయక్ అన్నారు. సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మహిళలు, పిల్లల భద్రత గురించి గురువారం సూర్యాపేటలోని చందనా గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో షీ టీమ్స్ పోలీస్ కళాబృందం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందనా నర్సింగ్ కాలేజీ చైర్మన్ ఉషాశ్రీ, షీ టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ జాఫర్, ఎల్లారెడ్డి, శివరాం, మహిళా కానిస్టేబుల్ సాయి జ్యోతి, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, నాగార్జున, కృష్ణ, గురులింగం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఘనంగా అమావాస్య పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

భానుపురి : పట్టణంలోని సాయినగర్‌లో సాయి బాబా ఆలయం ఆవరణలోని గంగా పార్వతి సమేత శివ సాయి దేవాలయంలో గురువారం అమావాస్య సందర్భంగా రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు గల రావిచెట్టు, వేపచెట్టు, మేడిచెట్టులకు ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సవరాల సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు శంకర్ లాల్, పూజారులు వలివేటి విశ్వేశ్వర శర్మ, మామిళ్లపల్లి గంగాధర్ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణరెడ్డికి ప్రముఖుల నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, తదితరులు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం వాసి, అర్వపల్లి శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ దేశిడి నారాయణరెడ్డి ఇటీవల మరణించారు. దీంతో గురువారం ఆయన దశదినకర్మను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి కమిటీ సభ్యుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకట్ నారాయణగౌడ్, చింతలపాటి చినశ్రీరాములు, ఎస్పీ సునీతారెడ్డి, గానుగుబండ సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

క్రైస్తవ స్త్రీల ఐక్య సదస్సు అభినందనీయం



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

భానుపురి : సూర్యాపేట సంఘ కాపరుల సహకారంతో క్రైస్తవ స్త్రీల ఐక్య సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని క్రీస్తు సంఘం మందిరంలో ఏర్పాటు చేసిన సేవకురాళ్ల ఐక్య సదస్సుకు వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏసుక్రీస్తు శాంతి, కరుణ, ప్రేమ మానవాళికి దారి చూపారని, వారు చూపిన బాటలో మనమంతా పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృప జబరాజ్, జిల్లా అధ్యక్షురాలు మీసాల లలితా ప్రభుదాస్, కొత్తపల్లి పిబెసిల్వి, గుంటూరు సులమితి బాబురావు, ఆశలత ప్రేమ్‌కుమార్, కేలోత్ నీలమ్మ, గ్రేస్ సామ్యూల్ కిరణ్, సరితా కరుణాకర్, సంధ్యా గోవర్ధన్, రెవరెండ్ జె.సుదర్శన్, బిషప్ ఏజే సామేల్, ఎస్తేరు డేవిడ్ రాజ్, పుల్లారు రాజ్యం, డానియల్, క్రిస్టియన్ మైనార్టీ కో ఆప్షన్ మెంబర్ పెద్దపంగు స్వరూపారాణి, దుర్గం ఏలీయా తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్‌ల పేరుతో అధిక ఫీజులు వసూలు

కోదాడఅర్బన్ : ఎంసెట్, నీట్, ఇతర ఎంట్రెన్స్‌లకు కోచింగ్‌ల పేరిట అధిక ఫీసులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై, కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కోదాడలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా, కోదాడ ప్రాంతంలో ఎంసెట్, నీట్ తదితర కోచింగ్‌ల పేరుతో అధిక కోచింగ్ సెంటర్లు వెలిశాయని, అదేవిధంగా కళాశాలల్లో కూడా ప్రత్యేకంగా కోచింగ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే నిబంధనలకు విరుద్ధంగా డొనేషన్‌ల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని, అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభించారన్నారు. అనుమతులు లేని ప్రైవేట్ స్కూల్స్ కూడా జిల్లాలో వెలుస్తున్నాయని, అధికారులు వీటిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సంతోష్, కల్యాణ్, నందు, శ్రావణ్, గోపి, సునీల్ తదితులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యంతో రైతులకు మద్దతు ధర



నాగారం : పస్తాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్‌ఎంపీపీ మణిమాల



తిరుమలగిరి : తాటిపాములలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ స్నేహలత



అర్వపల్లి : సూర్యనాయక్‌తండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

తిరుమలగిరి : రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. గురువారం తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకే ఈ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమణారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మూల అశోక్‌రెడ్డి, సర్పంచ్ ఎర్ర శోభ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు ప్రవీణ్, ఏపీఎం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు సక్రమంగా జరపాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సక్రమంగా కొనుగోళ్లు జరపాలని తిరుమలగిరి తహసీల్దార్ రమణారెడ్డి కోరారు. గురువారం మహిళా సమాఖ్య కార్యాలయంలో ట్యాప్ ఆపరేటర్లు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడ్డా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సైదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తేవాలి

నాగారం : రైతులు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల అన్నారు. గురువారం మామిడిపల్లి, పస్తాల, శాంతినగర్ గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఎంపీడీఓ శోభారాణి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ యారాల రాంరెడ్డి, ఏఓ గణేష్, ఏపీఎం ఆనంద్, ఏఈఓలు రమ్యతేజ, సాయిరాజ్, సర్పంచ్‌లు బిళ్ల పుష్పమాలసత్తిరెడ్డి, మల్యాల ఈశ్వరమ్మ, ఎస్‌కే. నాగుల్‌మీరా, ఎంపీటీసీలు బండగొర్ల నరేష్, జంపాల శోభరాజు, నాయకులు కూరం వెంకన్న, పాదిల రమేష్, మహిళా సంఘాల సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అర్వపల్లి : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ కోరారు. గురువారం సూర్యనాయక్‌తండాలో సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, ఏపీఎం మల్లేష్, సర్పంచ్‌లు లునావత్‌స్వాతిరవీందర్‌నాయక్, జాల నర్సయ్య, ఉపసర్పంచ్ సుజాతసంజీవ్‌నాయక్, గిలకత్తుల వీరయ్య, భీమా, నర్సింహ, సురేందర్, గోవింద, జాల మల్లయ్య, డాక్టర్ వెంకన్న, సురేష్, మల్లేష్, రమేష్, వీఓఏ సునీత, లునావత్ నాగులు తదితరులు పాల్గొన్నారు.

ఆరబెట్టి, శుభ్రం చేసిన ధాన్యాన్ని తేవాలి

రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రం చేసి కేంద్రాలకు తెస్తే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని సహకార సీనియర్ ఇన్‌స్పెక్టర్, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల మండల సూపర్‌వైజర్ ఎస్‌కే. బడేసాహెబ్ అన్నారు. గురువారం జాజిరెడ్డిగూడెం, కొమ్మాల, రామన్నగూడెం పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యంలో 17శాతం లోపు తేమ ఉండేలా తెస్తే క్వింటాకు మద్దతు ధర రూ. 2,660 లభిస్తుందని చెప్పారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ మేడెబోయిన రామస్వామి, సిబ్బంది శ్రీకాంత్, ఎం. సైదులు, మహేందర్, శ్రీను, జాజిరెడ్డిగూడెం కేంద్రం ఇంచార్జి రమేష్ పాల్గొన్నారు.



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో ధాన్యం కాంటాలు పరిశీలిస్తున్న సహకార సీనియర్ ఇన్‌స్పెక్టర్



తిరుమలగిరి : మాట్లాడుతున్న తహసీల్దార్

మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



పెన్‌పహాడ్ : అనంతారంలో ముస్లింలకు తోఫా కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



దురాజ్‌పల్లి : ఇఫ్తార్ విందులో పాల్గొన్న సంకినేని వెంకటేశ్వరరావు, ముస్లింలు



తిరుమలగిరిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెన్‌పహాడ్ : రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం, మైనార్టీ వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనిత అంజయ్య అన్నారు. గురువారం అనంతారం గ్రామంలోని మజీద్ ఆవరణంలో ముస్లింలకు రంజాన్ తోఫా అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మామిడి రేవతిపరందాములు, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, మస్తాన్, నాగార్జున, మదార్, దంతాల వెంకన్న, పేర్ల శ్రీధర్, శ్రీను, సయ్యద్, షాబు, బద్రోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ అత్యంత పవిత్ర మాసం

దురాజ్‌పల్లి : రంజాన్ అత్యంత పవిత్ర మాసమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో జిల్లాలోని ముస్లింలకు గురువారం ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ లీడర్లు మీర్ అక్బర్, ఎండీ అజీబ్, అస్లం, సలీమ్, యాకుబ్, జానీ పాషా, వాజీద్, మీర్ సికేందర్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తిరుమలగిరి మున్సిపల్ వైస్‌చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి తిరుమలగిరి మసీదులో ముస్లింలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమణారెడ్డి, ఎస్‌ఐ శివకుమార్, ఏఎస్‌ఐ జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, కౌన్సిలర్ నరేష్, పీఏసీఎస్ చైర్మన్ పాలేపు చంద్రశేఖర్, రవీందర్, షకీల్‌పాష, నరోత్తమ్‌రెడ్డి, సందీప్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింల ఐక్యతకు నిదర్శనం

సూర్యాపేట : సూర్యాపేట పట్టణం హిందూ ముస్లింల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోందని 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్, తెలంగాణ రాష్ట్ర ముస్లిం నాయకులు సయ్యద్ సలీం అన్నారు. రంజాన్ సందర్భంగా 45వ వార్డులో కౌన్సిలర్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గండూరి పావని, గండూరి కృపాకర్‌లు గురువారం ముస్లింలకు సొంత ఖర్చులతో నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు నూకల వెంకటరెడ్డి, వాంకుడోతు వెంకన్న, ముప్పారపు నాగేశ్వరరావు, గోపగాని గిరి, మల్లు వెంకటరామి రెడ్డి, రంగారెడ్డి, కొండపల్లి లక్ష్మారెడ్డి, యాదా కిరణ్, ఇస్మాయిల్, విద్యాసాగర్, కలకోట లక్ష్మయ్య, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

తిరుమలగిరి : రంజాన్ మాసం పురస్కరించుకొని కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, మహ్మద్ ఖలీల్, ఎండీ.హఫీజ్, జెమ్మిలాల్, భాస్కర్, వీరేష్, యాదగిరి, రాఖీ, రషీద్, ఉపేందర్, కళ్యాణ్, యశ్వంత్ పాల్గొన్నారు.

ముస్లిం బంధు పథకం అమలు చేయాలి

భానుపురి : రాష్ట్రంలోని పేద ముస్లింల అభివృద్ధి, సంక్షేమం, సాధికారత కోసం సీఎం కేసీఆర్ ముస్లిం బంధు పథకం అమలు చేయాలని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కౌసర్ మసీదులో తెలంగాణ జనసమితి పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు గట్ల రమా శంకర్, జిల్లా అధ్యక్షుడు మాంద్ర మల్లయ్య, మైనార్టీ సెల్ జిల్లా కన్వీనర్ రఫీ, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కుంచం చంద్రకాంత్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కంబాలపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బంధన్‌నాయక్, విద్యార్థి సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, నాయకులు బొడ్డు శంకర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తుందని, అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందని ఎంపీపీ మర్ల స్వర్ణలత అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుష్ప, ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి, ఎంపీడీఓ మల్సూర్ నాయక్, సర్పంచ్ తంగెళ్ల వీరారెడ్డి, ఎస్‌కే మీరా, మర్ల చంద్రారెడ్డి, మొహినుద్దీన్‌పాషా, దస్తగిరి, బషీరుద్దీన్ పాల్గొన్నారు.



తిరుమలగిరి : విందులో పాల్గొన్న ముస్లింలు



సూర్యాపేట : దుస్తులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్



ఆత్మకూర్ (ఎస్) : తోఫాలు అందిస్తున్న ఎంపీపీ

తలాపునే గోదారమ్మ .. చుక్క నీరు రాదాయే!



ఊరు వెంటే వెళ్తున్న గోదావరి జలాలు



కాలువ పక్కనే ఉన్నా చుక్క నీరు లేని మబ్బోరిచెరువు

- కాలువ సమీపంలో చెరువులు ఉన్నా అందని జలాలు
- పడమటితండా వద్ద తూము ఏర్పాటు చేస్తే 10చెరువులు, కుంటలకు అందే అవకాశం
- అధికారులు స్పందించాలని రైతుల వినతి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని పడమటితండా పక్కనుంచే ఎస్సారెస్పీ 71డీబీఎం కాలువను నిర్మించారు. ఈ కాలువ సమీపంలోనే కాసర్లపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని మబ్బోరి చెరువు ఉంది. ఈ కాలువకు కేవలం అరకిలోమీటర్ దూరంలోనే ఈ చెరువు ఉంటుంది. కనీసం చెరువలోకి చుక్క నీరు కూడా చేరడంలేదు.మబ్బోరి చెరువు గోదావరి జలాల ద్వారా నిండితే గ్రామంలోని బద్రెంకల, మర్ల, బాదువచెరువులతో పాటు కొమ్మాల, కోడూరు తదితర గ్రామాల్లోని 10 చెరువులు, కుంటలకు గొలుసుకట్టు ద్వారా నీళ్లు చేరనున్నాయి. అయితే ఈ 71డీబీఎం కాలువ నిర్మించి 10 ఏళ్లు దాటింది. కాలువ నిర్మాణం సందర్భంగా పడమటితండా వద్ద తూము నిర్మాణం చేపడితే నీళ్లు మబ్బోరి చెరువు ద్వారా సమీపంలోని చెరువులు, కుంటలు నిండేవి. పడమటితండా వద్ద తూము నిర్మించాలని ప్రజలు, రైతులు గత కొన్నేళ్లుగా నీటిపారుదలశాఖ అధికారులకు వరంగల్, జనగామ, సూర్యాపేట ప్రాంతాల్లోని కార్యాలయాలకు వెళ్లి అనేకసార్లు వినతి పత్రాలు కూడా ఇచ్చారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ దృష్టికి ప్రజాప్రతినిధులు, రైతులు తీసుకెళ్లగా ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సర్వే చేసి తూము ఏర్పాటు చేయాలని ఆదేశించారు కూడా. కానీ ఇంతవరకు తూము ఏర్పాటు కాక చెరువులు, కుంటలకు నీళ్లు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వచ్చే సీజన్ వరకైనా తూమును నిర్మించి సమీపంలోని చెరువులు, కుంటలకు నీళ్లు వెళ్లేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చెరువులకు నీళ్లు అందడం లేదు



మర్లచెరువు సమీపంలోనే 3ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే ఈ చెరువుకు గోదావరి జలాలు రాక మా భూమికి నీళ్లు అందని పరిస్థితి ఏర్పడింది. పడమటితండా వద్ద తూము నిర్మిస్తే చుట్టూ గ్రామాల చెరువులు, కుంటలకు నీళ్లు అందనున్నాయి.

– చెరుకు తిరుపతయ్య, రైతు, కాసర్లపహాడ్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పడమటితండా వద్ద ఎస్సారెస్పీ 71డీబీఎం కాలువకు తూము నిర్మాణం చేపట్టి ఉపకాలువ ద్వారా మబ్బోరి కుంటకు నీళ్లు వదిలితే చుట్టూ ఉన్న 10 గొలుసుకట్టు చెరువులు, కుంటలకు నీళ్లు వెళ్లనున్నాయి. అయితే ఈ విషయాన్ని సంబంధిత ఎస్సారెస్పీ అధికారుల తెలిపాం. వరంగల్, జనగామ, సూర్యాపేటలలోని కార్యాలయాలకు వెళ్లి వినతి పత్రాలు కూడా ఇచ్చాం.

– దబ్బేటి జ్యోతిరాణి, సర్పంచ్, కాసర్లపహాడ్

అనాథాశ్రమంలో అన్నదానం

నాగారం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకుడు జన్మదినం పురస్కరించుకొని ఫణిగిరి మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల ఆశ్రమంలో టీడీపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకారపు రమేష్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథాశ్రమంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పులుసు శేఖర్, సుధగాని పాండు, వెంకన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.